క్లుప్తంగా

అంతర్జాతీయ బాలికా దినోత్సవం


పోస్టర్ విడుదల చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు

పెనుగొండ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ ఎస్కేవీఆర్ బాలికోన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికలకు హక్కులు, వాటిని కాపాడేందుకు చట్టాలు, బాల్య వివాహాల నిరోధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బాలికాదినోత్సవం పోస్టర్ విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందుకూరి పద్మావతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు జి.సుజాత, ఎం రూతకుమారి, సచివాలయ మహిళా పోలీస్‌లు జి.శ్రీదేవి, రమ్య, టి.జోషి, ప్రవీణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ ఆకస్మిక తనిఖీ


క్లస్టర్ కాంప్లెక్స్ తనిఖీ చేస్తున్న నారాయణరాజు

పాలకొల్లు సెంట్రల్: షెడ్యూల్ ప్రకారం కాంప్లెక్స్ మీటింగ్‌ల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు నూరు శాతం లేకపోయినా చర్యలు తప్పవని సర్వశిక్షా అభియాన్ ఏఎస్ఓ ముదునూరి నారాయణరాజు హెచ్చరించారు. శనివారం స్థానిక క్లస్టర్ పాఠశాలల్లో ఆయన ఆకస్మిక క్లస్టర్ కాంప్లెక్స్ తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ఆధార్ అప్డేషన్‌కు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఝాన్సీ లక్ష్మీబాయి, సెక్రటరీ రాయపూడి భవానీప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పడాల పల్లపు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ కొనుగోలుకు ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న దొరబాబు

పెనుగొండ: పిట్టల వేమవరం వాస్తవ్యులు, ప్రస్తుతం కర్ణాటకలో ఉంటున్న పడాల బులివీర్రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు మల్లికార్జున రెడ్డి, వెంకట రెడ్డిలు పెనుగొండ మానవత ఆధ్వర్యంలో నూతన ఫ్రిజరు ఏర్పాటుకు రూ.95 వేలు ఆర్థిక సాయం అందించారు. శనివారం మానవత జిల్లా కార్యవర్గ సభ్యుడు టీవీకే రంగా రెడ్డి (దొరబాబు) ద్వారా మానవత జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రి నరేంద్ర రెడ్డికి నగదును అందించారు. దాతలకు మానవత సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు


ఆలయం వద్ద పూజ చేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ దేవస్థానంలో ధనత్రయోదశి సందర్భంగా మహాలక్ష్మి కుబేర ధనపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఏ. శ్రీరామ్ నేతృత్వంలో ఆయుష్ సిబ్బంది సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు. వైద్య శిబిరానికి సహకారం అందించిన. వైద్య సిబ్బందిని సత్కరించారు.

బాధితులకు పరామర్శ


పాస్టర్‌ను పరామర్శిస్తున్న రఘురాం

పెంటపాడు: ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న, అనారోగ్యానికి గురైన పార్టీ నేతలను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం శనివారం పరామర్శించారు. కొండేపాడు పాస్టర్ కొడమంచిలి ఏసురాజు దంపతులు ఇటీవల ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటుండగా, వల్లూరుపల్లిలో పార్టీ నాయకురాలు ఉందుర్తి ఝాన్సీ కిడ్నీ వ్యాధితో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. వారిని రఘురాం పరామర్శించారు.

మడుగుల్లా ఆచంట కచేరీ సెంటర్ రోడ్లు


ఆచంట కచేరీ సెంటర్‌లో మార్టేరు వైపు రహదారి దుస్థితి


పాలకొల్లు వైపు రోడ్డుపై ఉన్న గోతులు


మురుగు డ్రెయిన్ వంతెన అప్రోచ్ వద్ద గోతులు

- నియోజకవర్గ కేంద్రం ఆచంటలో దుస్థితి
- రాకపోకలకు హడలిపోతున్న వాహనచోదకులు

పెనుగొండ: గోతులు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యమంటూ కూటమి ప్రభుత్వం చేసిన ఆర్భాటం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. మొదటి ఆరు నెలలు మాత్రమే రోడ్ల నిర్వహణ చేపట్టి అనంతరం గాలికి వదిలేయడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై బారీ గుంతలు ఏర్పడి వర్షం వచ్చినప్పుడు నీరు చేరి మడుగుల్లా దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రం ఆచంట కూడలి దాటి బయట అడుగు పెట్టాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఆచంట కచేరీ సెంటర్ నుంచి మార్టేరు వైపు, పాలకొల్లు వైపు వెళ్లే రోడ్లు శిథిలావస్థకు చేరాయి.

బారీ గోతులు

ఆచంట కచేరీ సెంటర్ వద్ద ఏడేళ్ల క్రితమే రహదారి విస్తరణ చేసి సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే, కచేరీ సెంటర్ నుంచి మార్టేరు వైపు న్యాయ చిక్కులు రావడం విస్తరణ రహదారి కొంతమేర నిలిపివేసి తిరిగి నిర్మాణం చేశారు. ఈ మధ్యలో ఉన్న రహదారి పూర్తిగా గోతుల మయంగా మారింది. చినుకు పడితే చాలు గోతులు చెరువుల్లా నిండిపోతుండడంతో అంచనా లేక పడిపోతూ వాహనచోదకులు గాయాల పాలవుతున్నారు. ప్రతి ఏటా చిన్నచిన్న మరమ్మతులు చేసి వదలివేస్తున్నారు. ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎండలు వచ్చినపుడు వాహనాల రాకపోకలతో ఎగిరిన దుమ్ముతో, వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి బురదతో రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు నిండిపోతున్నాయి. దీంతో వారి బాధలు వర్ణనాతీతం. అలాగే, మార్టేరు రహదారిలో ఆచంట శివారు మురుగు వంతెన అప్రోచ్ వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ కనీస మరమ్మతులు చేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రకటనలకే పరిమితం

ఆచంట కూడలి నుంచి పాలకొల్లు వెళ్లే రహదారి పూర్తిగా గోతులతో నిండిపోయింది. వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో సమీప దుకాణదారులే వర్షపు నీరు డ్రెయినేజీల్లోకి వెళ్లేలా దారులు ఏర్పాటు చేసి, కాస్త ఉపశమనం పొందుతున్నారు. అధికారులు మాత్రం గోతులను అలానే వదలి వేసి చోద్యం చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పాలకొల్లు వైపు రహదారిపై గోతులు లేకుండా చర్యలు తీసుకొంటామని అధికారులు, కూటమి నాయకులు చేసిన ప్రకటనలు అమలుకు నోచుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి నియోజకవర్గ కేంద్ర ప్రధాన కూడలి వద్ద గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీ కులాల ఐక్యతకు నిరంతర పోరాటం


ఆంజనేయులును అభినందిస్తున్న గణేష్ భవాని

యలమంచిలి: బీసీ కులాల ఐక్యత కోసం నిరంతర పోరాటం చేయాలని ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ కోరారు. మండలంలోని మట్లపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన బీసీ కులాల ఐక్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ కులాల్లో 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలని కోరారు. బీసీ జాబితాలో ఏ, బీ, సీ, డీలుగా ఉన్న కులాలను విభజించి రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు మాట్లాడుతూ త్వరలో గ్రామాల్లో నూతన కమిటీలను నియమించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సంఘం యలమంచిలి మండల అధ్యక్షుడిగా కట్టా ఆంజనేయులును ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కట్టా నాగేశ్వరరావు, అగ్నికుల సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు పెసంగి ఏసుబాబు, కట్టా వెంకట నాగేశ్వరరావు, పొన్నమండ ఇమ్మానుయేలు, గుబ్బల గోపి, కొప్పాడి వర్మ, దొమ్మేటి ఈశ్వరరావు, కడలి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి


బియ్యపుతిప్పలో రచ్చబండ నిర్వహిస్తున్న నాయకులు

నరసాపురం రూరల్: వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటేనే సేవా దృక్పథంతో పనిచేయగలవని, ప్రైవేటు వారికి అప్పగిస్తే వ్యాపార దృక్పథంతో పనిచేస్తారని వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పీడీ రాజు అన్నారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శనివారం నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రాజు మాట్లాడుతూ ప్రజలకు ఇతోధిక సేవలు అందించాల్సిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం అంటే రాజ్యాంగ విలువలకు పాతర వేయడమే అన్నారు. కార్యక్రమంలో నరసాపురం మండల అధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడు, పులపర్తి ప్రతాప్, మైలాబత్తుల శ్రీను, అడ్డాల నరసింహారావు, అంద్రాజు చల్లారావు, కంకటాల పెద్దిరాజు, ఒడుగు సత్యనారాయణ, తిరుమాని కృష్ణంరాజు, సంగాని మోహనరావు, చింతా శ్రీను, కడలి అబద్దం, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మత్స్యకారులకు మేలు


పడవల ర్యాలీలో పాల్గొన్న మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం: జీఎస్టీ తగ్గింపుతో మత్స్యకారులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం జీఎస్టీ తగ్గింపు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలు అనే అంశంపై నరసాపురంలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వలంధర రేవు నుంచి రాజుల్లంక వరకు గోదావరిపై 100 పడవలతో ర్యాలీ చేశారు. ముఖ్యఅతిథి, మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ మత్స్యకారులు వేటకు వినియోగించే వలలు, ఇంజిన్ల ధరలు జీఎస్టీ తగ్గింపుతో తగ్గాయని తెలిపారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాస్ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు దేవస్థానం ఖాతాలోకి వెళ్లేనా?


శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తులు ఇచ్చే విరాళాలు దేవస్థానం ఖాతాలోకి వెళ్లేనా అని భక్తులు, టీడీపీ తెలుగు తమ్ముళ్లు కొందరు వాపోతున్నారు. దాదాపుగా 2016 నుంచి ప్రారంభమైన కార్తీకమాస నిత్యాన్నదానం 2019 వరకు తెలుగుతమ్ముళ్ల ఆధ్వర్యంలో భాగానే నిర్వహించారు. 2024లో నుంచి మళ్లీ గత తెలుగు తమ్ముళ్ల ఆధీనంలోకి అన్నదాన కార్యక్రమం వచ్చింది. దాతల విరాళాలను ఓ ప్రైవేటు వ్యక్తి అకౌంట్‌కు మళ్లించడంతో టీడీపీ నేతలతోపాటు పాటు పట్టణ ప్రజలు బహిరంగంగా విమర్శలు చేశారు. ఈ ఏడాది కార్తీకమాసం పూజా మహోత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్నాయి. ఇంతలో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటైంది. నూతన కమిటీ సభ్యులు కార్తీకమాస అన్నదానం కార్యక్రమ నిర్వహణ చేపట్టారు. టీడీపీ నేతలు నిర్వహించిన నాలుగేళ్ల అన్నదాన కార్యక్రమంలో నిల్వ ఉన్న నగదు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు ఉంటుందని, ఆ సొమ్ము స్వామివారి ఖాతాలో జమచేయాలని భక్తులతో పాటు, నూతన కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, వైఎస్సార్‌సీపీ హయాంలో 2022, 23 సంవత్సరాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అధికారుల సమక్షంలోనే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు ఇచ్చిన నగదుకు అధికారులు రశీదులు ఇచ్చేవారు.

దేవస్థానం ఖాతాలోకే విరాళాలు

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మీసాల రామచంద్రరావు (రాము) స్పందిస్తూ.. కార్తీకమాసం నిత్యాన్నదానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, దాతలు అందించే డిజిటల్ పేమెంట్స్‌కు ఆలయ అకౌంట్ నంబర్‌నే అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రస్తుతం నిత్యాన్నదానం నిమిత్తం స్వామివారి అకౌంట్లో సుమారు రూ. 38 లక్షల వరకు ఉందని, త్వరలో రూ.50 లక్షలు పూర్తిచేసి స్వామివారి సన్నిధిలో నిత్యాన్నదానం ఏర్పాటుచేస్తామని చెప్పారు.

తణుకు సబ్ జైలు సందర్శన

తణుకు అర్బన్: ఉమ్మడి గోదావరి జిల్లా న్యాయ సేవల సంస్థ సెక్రటరీ కె.రత్న ప్రసాద్ శనివారం తణుకు సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార వసతి, వైద్య సదుపాయాలపై జైలు సూపరింటెండెంట్ ఎ.మోహనరావును అడిగి తెలుసుకున్నారు. రిమాండ్ ముద్దాయిలు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే వారికి మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయ సేవలు అందిస్తారని చెప్పారు. వారానికి రెండు రోజులు ప్యానెల్ లాయర్, పారా లీగల్ వలంటీర్‌లు వచ్చి న్యాయ సలహాలు ఇస్తారని వివరించారు. న్యాయమూర్తులతోపాటు ప్యానెల్ న్యాయవాదులు డి.కృష్ణ కుమారి, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా ఎకో ఫ్రెండ్లీ దీపావళి


హైస్కూల్లో ఎకో ఫ్రెండ్లీ దీపావళిని నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం కేపీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎకో ఫ్రెండ్లీ దీపావళి (పర్యావరణ అనుకూల దీపావళి)ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు ముందుగా లక్ష్మీపూజ చేశారు. మట్టి ప్రమిదలలో నూనె పోసి ఒత్తులు వేసి దీపాలు వెలిగించారు. దీపావళి పండుగ ప్రత్యేకతను ప్రధానోపాధ్యాయిని పితాని ఇందిర వివరించారు. ఎకో ఫ్రెండ్లీ దీపావళి వల్ల పర్యావరణ సుస్థిరతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, కాలుష్యం, హానికరమైన ఉద్గారాలను తగ్గించవచ్చని తెలిపారు. తొలుత పర్యావరణ పరిరక్షణ కోరుతూ విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేపీపాలెం నార్త్ సర్పంచ్ కడలి సోంబాబు పంచాయతీ సెక్రెటరీ తిరుమాని రవి వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి


బాణసంచా షాపులు ఏర్పాటు ప్రాతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: దీపావళి బాణసంచా విక్రయదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. శనివారం రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న దీపావళి మందుల షాపులను ఆయన పోలీసు అధికారులతో కలసి తనిఖీ చేశారు. దుకాణాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ అయితం సత్యనారాయణ, సీఐ బిజయాదగిరి, మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తదితరులు ఉన్నారు.

అనుమతులు తప్పనిసరి

యలమంచిలి: దీపావళి బాణసంచా అమ్మే వ్యాపారులు దుకాణాలను జనావాసాలకు దూరంగా, ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు పాటించాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్ ఆదేశించారు. బాణసంచా దరఖాస్తుదారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో 3, ఇలపకుర్రులో 1, దొడ్డిపట్లలో 4, కట్టుపాలెం 1, యలమంచిలి 1 షాపు మొత్తం 10 షాపులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అనుమతి లేకుండా దీపావళి దుకాణాలు ఏర్పాటుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బాలికకు న్యాయం చేయాలని వినతి


బాలికకు న్యాయం చేయాలని కోరుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకొల్లు మండలం వెలివెల గ్రామానికి చెందిన మైనర్ బాలికను చేబ్రోలు గ్రామానికి చెందిన కనుబోయిన మహేంద్ర మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేశాడని, ఆ బాలికకు న్యాయం చేయాలని దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి డీఆర్వో సీసీ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ దీనిపై అధికారులు వెంటనే స్పందించి మైనర్ బాలికకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికకు ఒక పాప కూడా పుట్టిందని, బాలికను వదిలేసి మానసికంగా వేధిస్తున్నారని, దీనిపై పాలకొల్లు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆయన వాపోయారు. కార్యక్రమంలో మాగపు శ్రీనివాస్, పట్టెం శుభాకర్, అంబటి ఆనంద్ కుమార్ మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భీమవరం: సమాజంలో స్త్రీ, పురుష బేరాలు నేటికి కొనసాగుతుండడం అత్యంత బాధాకరమని ఇటువంటి తరుణంలో సమానత్వం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ పావనీ అన్నారు. శనివారం భీమవరంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా గర్ల్ కన్వెన్షన్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అసమానతలు రాజ్యమేలుతున్నాయని, రాజ్యాంగంలోని సమాన హక్కుల సాధనకు అంతా నడుం బిగించాలన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని మహిళలకు రక్షణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులపై స్కూల్స్, కళాశాలల్లో లైంగిక వేధింపులు, దాడులు నిరంతరం జరుగుతున్నాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థినులకు విద్య అందటం లేదని విద్య ప్రైవేటీకరణ వల్ల అందని ద్రాక్షలా మారిందని, ప్రభుత్వం అందరికీ సమానత్వంతో కూడినటువంటి విద్యనందించాలని పావనీ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి టి ప్రసాద్ మాట్లాడుతూ చరిత్ర పాఠ్యాంశాల్ని తీసివేసి మతోన్మాదంతో మూఢనమ్మకాలని పాఠ్యాంశంలో పెడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస అవకాశాలు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ హామీ ఇచ్చినా సుగాలి ప్రీతి కేసు నేటికీ నెరవేరకపోవడం దురదృష్టకమన్నారు. అనంతరం జిల్లా గరల్స్ కన్వీనర్‌గా బి సింధు, కో కన్వీనర్లుగా ఎం భాగ్యలక్ష్మి, టి రేష్మతో సహా 14 మందితో జిల్లా గరల్స్ కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం అర్బన్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా చెకుముకి కన్వీనర్ రేపాక వెంకన్నబాబు అన్నారు. భీమవరం మండలం అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు -2025 నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చెకుముకి కన్వీనర్ రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతుందని దేశాలన్నీ ఒకే వేదికపైకి వస్తున్నాయన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తిని కనబరిచి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ పోటీల్లో జి. జయనాగ సుమశ్రీ, ఎమ్ హాసిని, కె. హర్షవర్ధన్‌లను విజేతలుగా ప్రకటించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీ సూర్యభగవాన్ రాజు మాట్లాడుతూ ఈ పోటీలకు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. శస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. వనజ, కేవీవీ సాగరరాజు, ఎంవీ శ్రీలక్ష్మి, ఎస్ శారద, ఎస్ మావుళ్లమ్మ, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ ప్రేమరాజు, వీఆర్ఎస్ఎస్ఎన్ మూర్తి, పి. అరుణకుమారి, కె. గిరిజా రమాదేవి, సీహెచ్ జలాబాయి, ఎమ్ బాల పల్లాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో స్థానిక అగ్రికల్చరల్ మార్కెట్ యార్డు చైర్మన్ కోడి విజయభాస్కర్ ప్రమాణ స్వీకారోత్సవం మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీఐసీసీ చైర్మన్ రామరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసరి రత్నరాజు పాల్గొని మాట్లాడారు.

స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

పెనుగొండ: స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆచంటలో ఎంపీడీఓ బి.కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వాటర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య, సీతారాం, పృథ్వీ, పిచ్చయ్య, తహసీల్దారు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

- పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు కేబీకే ఎస్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి జె.సత్యనారాయణ, ఎస్ మీరమ్మ, పీహెచ్ఎన్ సీహెచ్ పద్మలు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

ఉండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల గుర్తింపులో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ నుంచి 28వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించి ఆమోదించడం జరుగుతుందన్నారు. 21వ తేదీన చిలుకూరు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, 22వ తేదీన ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ, 23న చిన పుల్లేరు, పెదపుల్లేరు, వాండ్రం, 24న పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, 25న అర్తమూరు, చెరుకువాడ, కలిసిపూడి, 27న యండగండి, ఉణుదుర్రు, 28న వెలివర్రు, ఉండి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి బడ్జెట్ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభల నిమిత్తం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు టాంటాం ద్వారా గ్రామ ప్రజలందరికీ తెలియజేయాలని ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు గ్రామ సభకు హాజరైయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

సందడి లేని దీపావళి

ఆకివీడు: దీపావళి పండుగ సందడి లేకుండా పోయింది. వారం రోజుల ముందు నుంచే దీపావళి బాణసంచా కాల్చుతూ యువత ఉత్సాహంగా తిరిగేవారు. ప్రజల వద్ద డబ్బు లేకపోవడంతో దీపావళి పండగు వెలవెలబోతుంది. గత ప్రభుత్వంలో వలే ప్రజలకు సంక్షేమ పథకాల సొమ్ము అందకపోవడం, పంటలకు ధర లేకపోవడం, పెట్టుబడులు భారీగా పెరిగిపోవడం, ఆక్వా రంగం కుదేలవ్వడంతో ఆర్థిక మాంద్యంతో ప్రజలు కొట్టుమిట్టాడుతోన్నారు. ఇతర వ్యాపారాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. కిరాణా, దుస్తుల షాపులు, ఇతర షాపులన్నీ బేరాలు లేక బెంబేలెత్తిపోతున్నారు. దీపావళి మందుగుండు సామన్ల కొనుగోళ్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ధరలు అధికంగా ఉన్నాయని, అయినప్పటికీ దీపావళి పండుగ సరదా కోసం కొనాల్సి వస్తుందంటున్నారు. రైటైల్ దీపావళి మందగుండు షాపుల్లో ధరలు ఏ విధంగా ఉంటాయోనంటున్నారు. ఏదిఏమైనా దీపావళి పండుగు పేలవంగా సాగిపోతుందంటున్నారు.

విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ

భీమవరం: భీమవరం పట్టణంలోని వెంకటేశ్వర బధిర పాఠశాలలోని విద్యార్థులకు దీపావళి సందర్భంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం స్వీట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్రీడా అసోసియేషన్ సభ్యుడు పెన్మెత్స శ్రీధర్ మాట్లాడుతూ బధిరుల పాఠశాలలో పండుగ వాతావరణం ముందే కన్పిస్తోందని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.